ఈనాడు
నిజామాబాద్
శనివారం అక్టోబరు 5, 2024

మహాలక్ష్మి పథకంతో లాభాల్లో ఆర్టీసీ : మంత్రి పొన్నం

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: మహాలక్ష్మి పథకంతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల బాట పట్టిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నిజామాబాద్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో శుక్రవారం ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు 500 ఎలక్ట్రికల్ బస్సులు తీసుకొస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌కు 67 ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించామన్నారు. ప్రస్తుతం 13 అందుబాటులోకి వచ్చాయన్నారు. మహాలక్ష్మి పథకంతో ఇప్పటివరకు 94 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో కొత్త బస్సులు కొనుగోలు చేయక.. ఒక ఉద్యోగం ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులు వారి కుంటుంబ సభ్యుల సహకారంతోనే మహాలక్ష్మి పథకం విజయవంతమైందన్నారు. కారుణ్య నియామకాలు చేపడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కృషిచేస్తున్నామన్నారు. భవిష్యత్తులో గ్రామగ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నగర్ మేయర్ నీతూకిరణ్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ఎలక్ట్రికల్ బస్సు ప్రారంభిస్తున్న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు

ఎస్సారెస్పీ నాలుగు వరద గేట్ల ఎత్తివేత

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద చేరిక 34,221 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయంలో పూర్తి స్థాయిలో నీటి నిల్వ ఉన్నందున సాయంత్రం ఆరు గంటల తర్వాత నాలుగు వరద గేట్లను ఎత్తి 12,496 క్యూసెక్కులను మిగులు జలాలుగా గోదావరి నదిలోకి వదిలారు.




వేదికపై మండవ వెంకటేశ్వర రావు, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, అజారుద్దీన్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వీహెచ్, ఎమ్మెల్యే పోచారం, వేంనరేందర్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎంపీ సురేశ్ షెట్కార్, సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు

ఇందూరు అభివృద్ధికి ముందుంటా

సన్మాన సభలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్



విద్యార్థి దశ నుంచి కష్టపడిన తనను పార్టీ గుర్తించి.. ఇంతటివాడిని చేసిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలుపునకు పనిచేసిన ప్రతి నాయకుడికి వచ్చే రోజుల్లో పదవి దక్కే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. పీసీసీ బాధ్యతలు చేపట్టాక.. శుక్రవారం తొలిసారిగా జిల్లాకు చేరుకున్న ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మాధవనగర్ సాయిబాబా ఆలయంలో పూజలు చేసిన అనంతరం నగరం వీధుల్లో ర్యాలీగా సన్మాన సభ వేదిక వద్దకు చేరుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ.. భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ (నాగన్న చెరువు గ్రామం) నుంచి దిల్లీ వరకు గుర్తించే పదవి దక్కిందంటే ఆ గ్రామంలో తాగిన నీరు.. తల్లిదండ్రులు చేసుకున్న పుణ్యమన్నారు. రాజకీయంగా డీఎస్‌తో విభేదాలున్నా.. నా రాజకీయ గురువు ఆయనే అన్నారు. తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చి ప్రోత్సహించారని.. పదవి వచ్చాక ఆశీర్వాదం తీసుకోవాలకున్నానని, డీఎస్ మనమధ్య లేకపోవటం దురదృష్టకరమని పేర్కొన్నారు. 27 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని పార్టీ కల్పించినా.. గెలవలేకపోయానన్నారు. ఓటములు, అవమానాలు ఎదురైనప్పటికీ.. వాటి నుంచి తేరుకొని ముందుకెళ్లానన్నారు.

ప్రాధాన్యమివ్వాలి...

ఒకప్పుడు ధాన్యాగారంగా విరసిల్లిన ఇందూరు జిల్లా.. ఇప్పుడు వెనుకబడిందన్నారు. చక్కెర పరిశ్రమలతో ఎంతో సుసంపన్నంగా ఉండేదని.. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడిది పీసీసీ అధ్యక్షుడు ఉన్న జిల్లా అని, వేదిక మీద ఉన్న మంత్రులు నిధులు కేటాయించే విషయంలో దృష్టి సారించాలని నవ్వుతూ సూచించారు. పనుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. కాళేశ్వరం 21వ ప్యాకేజీ పనులు నిలిచిపోయాయని, ఆర్థిక మంత్రిని నిధులడిగితే.. ఇద్దామంటున్నారు తప్ప. . ఇంకా ఇవ్వలేదన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట.. భట్టి విక్రమార్క వింటారని తనకు తుమ్మల నాగేశ్వరరావు, మరికొందరు తెలిపారని చమత్కరించారు. నిధుల విషయం ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కతో శ్రీధర్‌బాబు మాట్లాడాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో మంచి అవకాశం ఉందని.. ఈ దిశగా కృషి చేయాలని కోరారు. జిల్లాకు మరో ప్రభుత్వ వైద్యకళాశాలతో పాటు ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ఆవశ్యకత ఉందన్నారు. జిల్లాలో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తారని, రానున్న రోజుల్లో ప్రభుత్వపరంగా సహాయం అందిస్తామన్నారు. నిఖత్ జరీన్, సిరాజ్‌కు నిబంధనలు సడలించి డీఎస్పీ పోస్టులు ఇచ్చేలా కృషి చేశామన్నారు. పార్టీ కార్యక్రమం కావటంతో ప్రైవేటు హెలికాప్టర్‌లోనే మంత్రులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి, కుటుంబ సభ్యులు నిజామాబాద్ వచ్చారని చెప్పారు. సభలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, లక్ష్మీకాంతరావు, లక్ష్మణ్‌కుమార్, కేఆర్ నాగరాజు, కార్పొరేషన్ ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, కాసుల బాలరాజ్, మార గంగారెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాసింగ్, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, రాజేశ్వర్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు నగేష్‌రెడ్డి, గడుగు గంగాధర్, నగర అధ్యక్షుడు కేశ వేణు, ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్, సుజాత పాల్గొన్నారు.

తరలివచ్చిన మంత్రులు

పీసీసీ అధ్యక్షుడి సన్మాన సభకు ఆరుగురు రాష్ట్ర మంత్రులు తరలొచ్చారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సభలో తమ ప్రసంగాలతో మహేష్‌కుమార్ గౌడ్ పార్టీకి చేసిన సేవలను వివరించారు. సభా వేదికపై పీసీసీ అధ్యక్షుడిని సన్మానించేందుకు నాయకులు పోటీపడ్డారు.





టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీలను సన్మానిస్తున్న నాయకులు : నగరంలో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు



సభకు హాజరైన పార్టీ శ్రేణులు

వైద్యకళాశాలకు సోనియా పేరు..

నిజామాబాద్‌లో కాంగ్రెస్ హయాంలో ఏర్పాటైన వైద్యకళాశాలకు సోనియా గాంధీ పేరు పెట్టాలని పీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీ పేర్కొన్నారు. నాయకులంతా తన ప్రతిపాదనను ఆమోదించాలని వేదికపైనుంచి కోరారు. పార్టీకి జిల్లాలో సరైన కార్యాలయ భవనం లేదన్నారు. నిర్మాణం కోసం రూ.5 లక్షలు విరాళం ఇస్తున్నట్లు, అందరూ సహకరించాలని, భవనం నిర్మించే బాధ్యతను పీసీసీ అధ్యక్షుడు తీసుకోవాలన్నారు.

రెండో రంజీ మ్యాచ్ ఆడిందిక్కడే

అంతర్జాతీయ క్రికెట్ ఆడిన తాను.. తొలినాళ్లలో తన రెండో రంజీ మ్యాచ్ నిజామాబాద్ మైదానంలోనే ఆడానని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్ తెలిపారు. క్రికెట్‌లో ఎదిగిన మాదిరిగానే.. మహేష్‌గౌడ్ కాంగ్రెస్‌లో ఎంతో కష్టపడి ఈస్థాయికి ఎదిగారన్నారు. ఆయనకు తమ పూర్తి సహాయసహకారాలు అందించి.. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అంతా కలిసి పనిచేస్తామన్నారు. తనకు సమయం ఎక్కువగా లేనందున్న తన ప్రసంగాన్ని టీ-20 మ్యాచ్ కూడా కాదు.. ఏకంగా టీ-5 మ్యాచ్‌లా ముగిస్తున్నట్లు చెప్పి నవ్వులు కురిపించారు.

ఇంజినీర్లపై ఆగ్రహం.. వైద్యులపై ప్రశంసలు

నిజామాబాద్ కలెక్టరేట్ న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెండు పడకగదుల ఇళ్ల వివరాలు అడగ్గా.. అధికారులు సరిగా స్పందించలేదు. దీంతో మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యంపై సమీక్ష సందర్భంలో జిల్లా ఆసుపత్రిలో ఓపీ సంఖ్య వివరాలు తెలుసుకొని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జిల్లాల్లో ఇంత పెద్దసంఖ్యలో ఓపీ ఉండటం ఇక్కడే చూశానన్నారు. సూపర్‌స్పెషాలిటీ సేవలు లేకున్నా.. కాంట్రాక్టులో నియమించుకొని వైద్యం అందించటంపై అభినందించారు. కాగా ఆసుపత్రిలో ఆర్ఎంవో పోస్టులు లేకపోవటం, డ్రైనేజీ వ్యవస్థ సమస్యలను సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఇందుకు సంబంధించిన లేఖలు ఇవ్వాలన్నారు. కార్డియాలజీ విభాగాన్ని ఏర్పాటు చేసినా.. వైద్యుల పోస్టులు మంజూరు చేయలేదని చెప్పగా.. త్వరలోనే నియామకం చేసేలా చూస్తానన్నారు. ఆసుపత్రిలో సమస్యలపై వెంటనే స్పందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు సూచించారు. వైద్యమంత్రితో మాట్లాడి సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూడాలని.. ఆక్రమణకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదలొద్దని సూచించారు. మంత్రులు కోమటిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖ, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

'వీడీసీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు'

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)లు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా.. అభివృద్ధి పనులు చేపట్టేందుకు పని చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్‌తో కలిసి శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర అణగారిన వర్గాల ప్రజలను వీడీసీలు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ, పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే, ప్రతి మూడు నెలలకు ఓసారి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి పోలీసుస్టేషన్లకు పిలిచి స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో చట్టం నీరుగారిపోయే ప్రమాదం ఉందన్నారు. కలెక్టర్, సీపీ సమన్వయంతో పని చేస్తున్నారని అభినందించారు. కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, నీలాదేవి, శంకర్, నగర మేయర్ నీతూకిరణ్, అదనపు పాలనాధికారులు అంకిత్, కిరణ్ కుమార్, సాంఘిక సంక్షేమాధికారిణి నిర్మల, ఎస్సీ సంక్షేమాధికారి రమేష్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్, చిత్రంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ తదితరులు

సోయా పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలి: ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, వేల్పూర్ (కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: సోయా పంటను ఎంఎస్‌పీ ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి క్వింటాల్‌కు రూ.5,392 ధర చెల్లించి కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ వీడియో విడుదల చేశారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తే ప్రభుత్వం 6 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటుందన్నారు. మిగతా పంటను అమ్ముకోవాలంటే రైతులు ప్రైవేటు వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. జిల్లాకు వచ్చిన మంత్రుల సమీక్ష సమావేశం జరిపే రోజునే తనకు రావాలని సమాచారం ఇవ్వడం చూస్తోంటే తాను రావొద్దనే ఉద్దేశం కనిపిస్తోందన్నారు.

చేపల పంపిణీ సగమే

- 7 నుంచి విడుదలకు ఏర్పాట్లు
- బెడిసికొట్టిన ప్రభుత్వ ఉత్పత్తి

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

పోచంపాడ్ జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో కనీసం కోటి పిల్లలు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఈ సారి 25 లక్షల స్పాన్ పెంచితే ప్రతికూల వాతావరణంతో ఎదుగుదల లేక నిర్వీర్యమైపోయింది. దీనికి తోడు నిర్వహణ సరిగా లేక లక్ష్యం బెడిసికొట్టింది. ఫలితంగా మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేపపిల్లల పంపణీపై ప్రభావం పడింది. పూర్తిగా గుత్తేదారులపైనే ఆధారపడాల్సి పరిస్థితి. ఇప్పటికే పంపిణీ ప్రక్రియ రెండు నెలలు ఆలస్యం కావడంతో కనీసం సగం లక్ష్యమైనా చేరుకోవాలని సర్కారు యోచిస్తోంది. ఈ నెల 7 నుంచి జిల్లాలో ఎంపిక చేసిన చెరువుల్లో సగం పిల్లలైనా వదిలేందుకు యంత్రాంగం సిద్ధమైంది.

రెండు నెలలు ఆలస్యం..

జిల్లాలో 967 చెరువుల్లో 4.54 కోట్ల చేప పిల్లలు వదలాలని మత్స్యశాఖ అంచనా వేసింది. చిన్న పిల్లలకు 814 చెరువులు, పెద్ద పిల్లలకు 153 చెరువులు ఎంపిక చేశారు. మొత్తంగా 43,132 హెక్టార్ల పరిధిలో వీటిని పెంచేందుకు సుమారు రూ.4.50 కోట్ల బడ్జెట్ ప్రతిపాదించారు. టెండర్ల ఆలస్యం కారణంగా ఆగస్టు నాటికి ప్రారంభం కావాల్సి ప్రక్రియ అక్టోబరుకు చేరుకోవడంతో పంపిణీని సగానికి కుదించారు. ప్రస్తుతం రూ.2.50 కోట్లు వెచ్చించి కేవలం 2.34 కోట్ల పిల్లలు మాత్రమే వదిలేందుకు కార్యాచరణ రూపొందించారు.

ధరలు ఖరారు..

నాలుగు సంస్థలు బిడ్లు వేయగా మూడింటిని ఖరారు చేశారు. 35 ఎంఎం నుంచి 40 ఎంఎం మందం చిన్న చేపలకు ఒక్కోదానికి రూ.66 పైసలు, 80 ఎంఎం నుంచి 100 ఎంఎం ఉన్నవి ఒక్కోదానికి రూ.1.76 చెల్లించేందుకు సర్కారు సమ్మతించింది. మొత్తంగా 2.27 కోట్ల పిల్లలు అందించాలి. వెలగపూడి శివాజీ సంస్థ చిన్న పిల్లలు 75,90,459, పెద్దవి 51,21,270, వెలగపూడి గోపాల్ సంస్థ చిన్నవి 40 లక్షలు, పెద్దవి 30 లక్షలు, మాడవేణి జనార్దన్ సంస్థ చిన్నవి 20 లక్షలు, పెద్దవి 17.60 లక్షలు ఇవ్వాలని లక్ష్యం పెట్టారు. ఇప్పటికే చేపల పెంపకం చెరువుల పరిశీలన పూర్తయింది.



మొత్తం చెరువులు	:	967
మత్స్యకార సభ్యులు	:	23,657
మత్స్యశాఖ ప్రతిపాదించిన పిల్లలు	:	4.54 కోట్లు
అంచనా వ్యయం	:	రూ. 4.25 కోట్లు
ఈ ఏడాది వదిలే పిల్లలు	:	2.34 కోట్లు
అంచనా వ్యయం	:	రూ. 2.50 కోట్లు

పూర్తి పారదర్శకంగా.. : ఆంజనేయులు, జిల్లా మత్స్యశాఖ అధికారి

గుత్తేదారుల ఎంపిక, లక్ష్యం పూర్తయింది. ఉన్నతాధికారుల అనుమతితో ఈ నెల 7 నుంచి చెరువుల్లో వదులుతాం. పూర్తి పారదర్శకంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. మత్స్య సహకార సంఘాలు దగ్గరుండి చూసుకోవాలి.



అభ్యర్థి నిజధ్రువపత్రాలు పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

చివరిదశకు ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని నిర్మలా హృదయ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చివరిదశకు చేరుకుంది. 1:3 ప్రకారం ఎంపికైన ధ్రువపత్రాల పరిశీలన పూర్తికాని అభ్యర్థులు శనివారం తప్పనిసరి హాజరు కావాలని, లేనిపక్షంలో అభ్యర్థుల్ని నాట్‌విల్లింగ్‌గా పరిగణిస్తామని డీఈవో దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. శుక్రవారం 430 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 1150 మంది హాజరై ధ్రువపత్రాలు సమర్పించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉదయం ప్రత్యేక కేటగిరీ స్కూల్ అసిస్టెంట్ మెరిట్ జాబితాను విడుదల చేసింది.

టార్చ్ రిలే పరుగు నేడు


నిజామాబాద్ క్రీడావిభాగం: సీఎం కప్-2024లో భాగంగా ఎల్‌బీ స్టేడియం నుంచి ప్రారంభమైన టార్చ్ రిలే(పది కిలోమీటర్ల పరుగు) ఈ నెల 5న జిల్లాలోని ధర్మారంలోకి ప్రవేశించనుందని డీవైఎస్‌వో ముత్తెన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ధర్మారం నుంచి నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ పరుగు మరుసటి రోజు నిర్మల్‌కు వెళ్తుందన్నారు. జిల్లాలోని అన్ని క్రీడాసంఘాలు, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆగుతూ.. సాగుతూ..

● నత్తనడకన రైల్వే పై వంతెనల నిర్మాణాలు

నిజామాబాద్ జిల్లాలోని పలు చోట్ల రైల్వే పై వంతెన(ఆర్వోబీ)ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ, గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తి నిర్మాణాలతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. నెల రోజుల పనులు జరిగితే మరో రెండు నెలలు నిలిచిపోతున్నాయి. ఆర్మూర్‌లోని మామిడిపల్లి, మాక్లూర్ మండలం మామిడిపల్లి వద్ద, నిజామాబాద్‌లోని మాధవనగర్, అర్సపల్లిలో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. బోధన్‌లో శంకుస్థాపన జరిగినా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తిచేస్తే వేలాది మంది వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయి. ఆ దిశగా అధికారులు కృషి చేయాల్సిన అవసరముంది.

◆ ప్రాంతం ◆ పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి
❖ కేటాయించిన నిధులు ☛ ఇప్పటి వరకు ఖర్చు చేసినవి
★ పనులు ఎంత వరకు పూర్తయ్యాయి ★ జాప్యం జరగడానికి కారణాలు ●● రాకపోకలకు తలెత్తుతున్న ఇబ్బందులు
◆◆ నిత్యం రాకపోకలు సాగించే వాహనాలు ★★ అధికారి వివరణ



శంకుస్థాపనకే పరిమితం

● బోధన్ ◆ 2024 ఫిబ్రవరి 26(శంకుస్థాపన) ❖ రూ.160కోట్లు ☛ ఏమీ చేయలేదు ★ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ఐబీవద్ద వంతెన నిర్మాణానికి సంబంధించిన సంయుక్త సర్వే చేపట్టినా ఎప్పుడు ప్రారంభిస్తారన్న స్పష్టత లేదు.



●● రైలు వచ్చినప్పుడు నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. తరచూ గేటు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ◆◆ 5000

– న్యూస్‌టుడే, బోధన్ పట్టణం



● అర్సపల్లి బైపాస్ సమీపంలోని చెరువు వద్ద ◆ 2023 ఆగస్టు ❖ 137.05కోట్లు ☛ రూ.20 కోట్లు ★ 25 శాతం ★ చెరువు పక్కన ఉన్న భూమి యజమాని కోర్టుకు వెళ్లడంతో స్థల సేకరణకు డబ్బులు చెల్లించలేదు. ●● బాసర, బోధన్ వైపు వెళ్లే వాహనాలు ఇదే మార్గంలో వెళ్లడంతో రద్దీగా ఉంటోంది. బైపాస్ వద్ద రైల్వే గేటు పడినప్పుడు కి.మీ పరిధిలో వాహనాలు నిలిచిపోతున్నాయి. ◆◆ 3000

– న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

గేటు పడితే అర గంట ఆగాల్సిందే

● నిజామాబాద్ రూరల్ మాధవనగర్ ◆ 2022 ❖ రూ.93.12 కోట్లు ☛ రూ.33 కోట్లు ★ 40 శాతం ★ నిధులు సమయానికి కేటాయించకపోవడంతో సమస్య నెలకొంది. ●● ఇరువైపులా సర్వీసు రోడ్డు గుంతలమయంగా మారాయి. గేటు పడితే 15నుంచి 20 నిమిషాల పాటు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ◆◆ 3000 ★★ నిత్యం పనులు పర్యవేక్షిస్తున్నాం.. 40 శాతం వరకు పూర్తయ్యాయి. త్వరగా జరిగేలా చూస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ ప్రవీణ్ చెప్పారు.



– న్యూస్‌టుడే, డిచ్‌పల్లి గ్రామీణం

ఎనిమిదేళ్లయినా అసంపూర్తిగానే..

● మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి ◆ 2017 ❖ రూ. 23.9 కోట్లు ☛ రూ.18.5 కోట్లు ★ 80 శాతం ★ మొదట లేఔట్ మార్చడంతో పనుల్లో జాప్యం జరిగింది. ●● ఒకే మార్గం ఉండటంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గేటు పడిన సమయంలో ప్రయాణికులు గంట పాటు వేచి ఉండాల్సి వస్తోంది. ◆◆ 3000 ★★ పనుల్లో వేగం పెంచింది డిసెంబరు వరకు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ మల్లారెడ్డి తెలిపారు.



– న్యూస్‌టుడే, మాక్లూర్ గ్రామీణం

మిగతా 10శాతానికి ఆలస్యం..

● ఆర్మూర్‌లోని మామిడిపల్లి ◆ 2017 ❖ రూ. 34.90 కోట్లు ☛ రూ.30 కోట్లు ★ 90 శాతం ★ నిధులు ఉన్నా పనులు జరగటం లేదు. వంతెనపై రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. ●● పనుల పూర్తికానందున 4 కి.మీ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో అర గంట సమయం వృథా అవుతోంది. ◆◆ 4500 ★★ 10 శాతం పనులు పూర్తికావాల్సి ఉంది. ఈ నెలలో పూర్తిచేస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ మల్లారెడ్డి తెలిపారు.



– ఆర్మూర్ గ్రామీణం

ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2024- 25 విద్యాసంవత్సరానికి సంబంధించి పదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అపరాధ రుసుంతో ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ప్రవేశ రుసుం రూ. 1550తో పాటు రూ.100, ఇంటర్మీడియట్ ఫీజు రూ.1800తో పాటు రూ. 200 అపరాధ రుసుంతో ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలన్నారు. వివరాలకు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త రవీందర్ చరవాణి నెంబరు 80084 03518, 98492 34696లలో సంప్రదించాలని సూచించారు.

42 మంది గైర్హాజరు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ఆదర్శ హిందీ విద్యాలయంలో శుక్రవారం జరిగిన ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 42 మంది గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆంగ్లంలో 108 మందికి 81, ఇంటర్ ఆంగ్లంలో 68 మందికి 53 మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు.

సమావేశాలు.. పనుల గుర్తింపు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. 2025- 26 ఏడాదికి సంబంధించిన కార్యాచరణపై గ్రామాల్లో విస్తృతంగా సభలు నిర్వహిస్తున్నారు. అక్టోబరు 2 నుంచి ఆయా పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు, కూలీలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరై చర్చిస్తున్నారు. మొత్తం 56 రకాల పనులు చేపట్టడమే లక్ష్యంగా అంచనాలు రూపొందిస్తున్నారు. ఈ నెలాఖరుకు గ్రామ సభలు పూర్తి చేసి మండల పరిషత్‌లకు ఆ తర్వాత జిల్లాకు పంపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ ఏడాదికి సంబంధించిన పనులు కొనసాగుతాయి. ఆ తర్వాత ఏప్రిల్ 1 నుంచి కొత్తగా గుర్తించిన పనులు ప్రారంభిస్తారు.



పారదర్శకంగా..

నిధులు పక్కదారి పట్టకుండా గ్రామ సభలు కీలకంగా మారాయి. గతంలో ఇష్టానుసారంగా పనుల గుర్తింపు ఉండేది. కూలీలు, ప్రజల భాగస్వామ్యం లేక పోవడంతో ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయాలు సామాజిక తనిఖీల్లోనూ వెలుగు చూశాయి. దీంతో ప్రభుత్వం పారదర్శకత కోసం గ్రామసభలు నిర్వహిస్తోంది. క్షేత్రస్థాయిలో పనుల గుర్తింపునకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

	కామారెడ్డి	నిజామాబాద్
గ్రామ పంచాయతీలు	526	530
జాబ్‌కార్డులు	2,52,790	2,65,198
నమోదైన కూలీలు	5,28,794	5,41,818

సీజన్‌కు అనుగుణంగా..

సభల్లో సీజన్‌కు అనుగుణంగా పనులు గుర్తిస్తున్నారు. వ్యవసాయ సీజన్ మొదలైన ఉన్న రోజుల్లో కూలీల హాజరు తక్కువగా ఉంటుంది. అందుకే వ్యవసాయ పనులు లేని సమయంలో అత్యధిక శాతం మందికి పనులు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉభయ జిల్లాల్లో ముఖ్యంగా భూగర్భజలాల పెంపునకు అవసరమైన పనులకే ప్రాధాన్యమిస్తున్నారు. చెరువులు, కాలువలు, కుంటల్లో పూడికతీత, కాలువల్లో పిచ్చిమొక్కలు, పొదలను శుభ్రం చేయడం, నీటి కుంటల నిర్మాణం, కాంటూరు, సమతల కందకాల తవ్వకం, అంతర్గత మట్టి రోడ్లు, మొక్కలు, పండ్ల తోటల పెంపకం వంటివి గుర్తిస్తున్నారు.

ఎక్కువ మందికి ఉపాధి కల్పనే లక్ష్యం..

-సురేందర్, డీఆర్‌డీవో, కామారెడ్డి

జిల్లా వ్యాప్తంగా అక్టోబరు 2 నుంచి సభలు నిర్వహిస్తున్నాం. అందరి ఆమోదంతో పనుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుంది. ఎక్కువ మంది కూలీలకు పని కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

భిన్న సంప్రదాయం.. బతుకమ్మపై మమకారం

● పూలపండగలో ఉత్తరభారతీయులు



బతుకమ్మ సంబరాల్లో..

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఉపాధి.. వ్యాపారాల నిమిత్తం నిజాం కాలంలోనే ఇందూరుకు వచ్చి స్థిరపడిన రాజస్థానీయులు, గుజరాతీయులు, మారాఠీలు, బంజారాలు వంటి ఉత్తరభారతీయులు.. తమ సంప్రదాయాన్ని ఆచరిస్తూ దసరా నవరాత్రుల్లో గర్బా, దాండియా ఆటలు ఆడుతూనే.. బతుకమ్మపై అభిమానాన్ని చాటుకుంటూ పూలతో అమ్మవారిని పేర్చి పాటలు పాడుతూ.. ఆటలు ఆడుతున్నారు. విభిన్న సంస్కృతుల సమ్మేళనంగా.. మినీ భారతంగా ఇందూరుకు అరుదైన గౌరవం తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మపై వారి స్పందన.

ద్వారా నేర్చుకున్నా. తొమ్మిది రోజులు అందరు కలిసి రోజూ సాయంత్రం బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటున్నాం. అన్ని తండాల్లో బతుకమ్మ ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు.

మహారాష్ట్ర నుంచి..

..పాటిని (మరాఠీ), అంబేడ్కర్ కాలనీ, నిజామాబాద్



వేలాది మంది మరాఠీలు ఇక్కడ స్థిరపడ్డారు. ఇందూరుకు మాకు ఆత్మీయ అనుబంధం ఉంది. మాతృభాష మరాఠీ అయినా తెలుగు మాధ్యమంలోనే చదువుకుంటున్నా. ముఖ్యంగా బతుకమ్మ పండగ వచ్చిందంటే చాలా మా కాలనీలో సందడిగా ఉంటుంది. మేమే అడవికి వెళ్లి గునుగు, తంగేడు వంటి పూలను తీసుకొచ్చి బతుకమ్మ పేర్చుతాం. పసుపు గౌరమ్మను పూజిస్తాం.

మా అందరికీ ఇష్టం..

..మాపీ రాథోడ్, మాల్యాడిగిల్లి, నిజామాబాద్



మా మార్వాడీ మూమర్, కల్చేలియ నృత్యాలతో సమానంగా బతుకమ్మ నృత్యాలు చేస్తాం. గర్బా, దాండియాల మాదిరిగానే బతుకమ్మ ఆటలు ఆడుతున్నాం. అన్ని దేవుళ్లను పూలతో పూజిస్తాం. కాని అక్కడ బతుకమ్మను పూలతో తయారుచేయడం బాగుంది. ప్రకృతిలోని పూలను గౌరవించటానికే సందేశాన్నిస్తున్నారు.

తీజ్‌తో సమానంగా..

..భవ్యశ్రీ, సిరికొండ



మా బంజారాల్లో తీజ్ పండగను ఎలా చేసుకుంటామో బతుకమ్మను కూడా అలాగే ఘనంగా జరుపుకొంటున్నాం. పూలతో అమ్మవారిని పేర్చడం అమ్మ నిర్మల

ఆటపాటలపై శిక్షణ

..ఐశ్వర్య, ప్రకృతి చికిత్స, యోగా వైద్యురాలు, నిజామాబాద్



మన భారతీయ పండగల్లో ఆరోగ్యదాయకమైన అంశాలు ఎన్నో ఉంటాయి. ముఖ్యంగా బతుకమ్మ ఉత్సవంలో ఉపయోగించే పూలన్నీ పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తాయి. మాది మహారాష్ట్ర. పెళ్లితో ఇక్కడికి వచ్చి ప్రకృతి చికిత్స వైద్యురాలిగా స్థిరపడ్డా. అత్తమ్మ ద్వారా బతుకమ్మ పండగ గొప్పదనాన్ని తెలుసుకున్నా. ఇందూరులోని ఉత్తరభారతీయ మహిళలను ఒకే వేదిక మీదికి తీసుకువచ్చి బతుకమ్మ పండగను జరిపేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నా. మార్వాడీలు, గుజరాతీయులు, మరాఠీలకు గ్రామీణ మహిళలతో బతుకమ్మ పాటలు పాడుతూ.. ఎలా ఆటలు ఆడాలో అవగాహన కల్పిస్తున్నా.

నాటి సీపీ.. నేటి ఎమ్మెల్యే..

నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా కేఆర్ నాగరాజు 2023 మార్చి 31 వరకు పని చేసి ఇక్కడే పదవీవిరమణ పొందారు. అనంతరం గతేడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. శుక్రవారం జిల్లాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి హాజరయ్యారు. నాడు సీపీగా సేవలందించి, నేడు ఎమ్మెల్యేగా జిల్లాకు వచ్చారు.



– ఈనాడు, నిజామాబాద్

కర్షకుల కష్టాలు తెలపడానికే మహాసభ

కామారెడ్డి వ్యవసాయం, న్యూస్‌టుడే: కర్షకుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తేవడానికే భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ నెల 9న కామారెడ్డి జిల్లాకేంద్రంలో రైతుల రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నామని సంఘం జాతీయ, రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్‌ను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సాగులయిన కిసాన్, సంపన్న గ్రామం, సమర్థ భారత్ అనేవి భారతీయ కిసాన్ సంఘ్ ధ్యేయమన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆచార్య భాస్కర్, కొమిరెడ్డి అంజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగేష్, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు



సీతాఫలం.. భలే వ్యాపారం

మధురం.. సీతాఫలం.. ఆ పేరు వినగానే ఈ సీజన్‌లో ప్రతి ఒక్కరు లొట్టలేస్తుంటారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ఇందిరాచౌక్, భగత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో నిత్యం దా.వేలల్లో సీతాఫలాల వ్యాపారం సాగుతోంది. నిత్యం ఆరా జిల్లాల నుంచి పలువులు దిగుమతి చేసుకుంటున్నారు. ఒక్కో గంపను రూ.150 నుంచి రూ.200 విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో సీతాఫలం తినడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. కామారెడ్డితో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఫలాలను కొనుగోలు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులను ఎంపిక చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ/ఎస్టీ కమ్యూనిటీకి చెందిన ఐదుగురు నాన్ అఫిషియల్ సభ్యుల ఎంపికకు, ఇతర వర్గాల నుంచి ఎన్‌జీవోలతో అనుబంధం కలిగిన ముగ్గురు సభ్యుల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. సభ్యులు ఎలాంటి నేరపూరిత రికార్డు ఉండకూడదని సూచించారు. డిగ్రీ విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి చేసిన సేవా నేపథ్యాన్ని దరఖాస్తుల్లో పొందుపరచాలని కోరారు.

ముప్కాల్ ఎంపీడీవో మృతి

ముప్కాల్, బాల్కొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముప్కాల్ ఎంపీడీవో మహ్మద్ ముజీబ్ బొద్దీన్(58) హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆదిలాబాద్‌కు చెందిన ఈయన గత ఫిబ్రవరిలో ముప్కాల్ ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. గత నెల 30న ఆదిలాబాద్ నుంచి ముప్కాల్‌కు బస్సులో వచ్చారు. బస్సు దిగి మండల పరిషత్ కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.



మహ్మద్ ముజీబుద్దీన్

నిజామాబాద్
• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

కొనసాగిన న్యాయవాదుల నిరసన

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాదిపై దాడికి నిరసనగా రెండో రోజైన శుక్రవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులను బహిష్కరించి జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి, హోం మంత్రులకు వినతి పత్రాలు పంపించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, ఆశ నారాయణ, నాగేశ్, శ్రీకాంత్, మధుసూదన్‌గౌడ్, ఎం.వి.నాగేశ్వర్‌రావు, అవినాశ్, విశ్వక్‌సేన్, ప్రకాశ్, రాజు, గంగాధర్, అపూర్వ, సాయి స్వామిత్ తదితరులు పాల్గొన్నారు.

9న నల్ల జెండాలతో నిరసన

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: వర్గీకరణ అమలు చేయకుండా ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలు విడుదల చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అన్ని అనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాదిగలను డీఎస్సీ ఫలితాల్లో విస్మరించినందుకు నిరసనగా ఈ నెల 9న నగరంలో నల్ల జెండాలతో నిరసన తెలుపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు ప్రమోద్, పోశెట్టి, జాతీయ నాయకుడు గంగాధర్, బాలు, భూమయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048



సమస్య : బోధన్ ఆర్టీసీ కాలనీలో కల్వర్టు కాలువ గడ్డి పెరిగిపోయి మురుగు పారడం లేదు. పొదలు తొలగించాలి. **- రాజు, ఆర్టీసీ కాలనీ**



సమస్య : బోధన్ గోశాలరోడ్డు సమీపంలోని కాలనీలో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- పండరి, గోశాలరోడ్డు**

పరిష్కారం : ఈ విషయాలను శానిటరీ జవాన్ గాబ్రియెల్ సిబ్బంది చేత పరిష్కరింపజేశారు.

సమస్య : బోధన్ గోశాలరోడ్డు ప్రాంతంలోని కాలనీలో డ్రైనేజీ వెంట పెరిగిన గడ్డి తొలగించాలి. **- రాము, బోధన్**



పరిష్కారం : ఈ విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ గాబ్రియెల్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది చేత గడ్డి, మొక్కలు తొలగింపజేయించారు.

సమస్య: వడ్డెర కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనుక రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభం ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - ఎల్లయ్య, స్థానికుడు

సమాధానం: సమస్య నా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో సిబ్బందితో పరిశీలించి సరిచేయిస్తా. **- బాబా శ్రీనివాస్, విద్యుత్తు ఏఈ**

న్యూస్‌టుడే, బోధన్, మోపాల్

వరి.. నేలకొరిగి

సిరికొండ, న్యూస్‌టుడే: మండలంలోని రావుట్ల, న్యావనంది, చిన్నవాల్గోట్, నర్సింగ్‌పల్లి, సిరికొండ గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి వరి పంట నేలకొరిగింది. దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి నర్సయ్య శుక్రవారం పరిశీలించారు. పంట నష్ట నివేదికను ఉన్నత అధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈవో నిఖిల్, రైతులు ఉన్నారు.

వర్ని, న్యూస్‌టుడే: వర్ని మండలంలోని జాకోరా, జలాల్‌పూర్, కూనిపూర్, సైదాపూర్, లక్ష్మాపూర్ తదితర గ్రామాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఈదురుగాలులతో కురిసిన వర్షంతో వరి పొలాలు నేలకొరిగాయి. ఎకరా పంటలో సుమారు 40నుంచి 50 శాతం వరి నేలకొరిగి తడిసిపోయింది. చేతికొచ్చిన పంట వర్షానికి దెబ్బతినడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: పంట చేతికొస్తున్న తరుణంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి బోధన్ మండలంలోని అమ్దాపూర్, ఊటిపల్లి, సంగం, ఎరాజ్‌పల్లి తదితర గ్రామాల్లో వరి నేలవాలింది. శుక్రవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు పంటను చూసి ఆందోళన చెందారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టగా నేలవాలిన పంట నూర్పిడికి ఇబ్బందికరంగా ఉంటుందని వాపోయారు.



అమ్దాపూర్ శివారులో..



వర్ని: జాకోరాలో..



సిరికొండలో పంట పరిశీలిస్తున్న ఏవో నర్సయ్య



కొత్తహౌజింగ్‌బోర్డుకాలనీ ప్రసన్నాంజనేయ ఆలయంలో..



నగరంలోని ఏడుపాయల కనకదుర్గమ్మ ఆలయంలో..



బోధన్ అంబేడ్కర్ చౌరస్తాలో..



నవీపేటలో..



బోధన్ గ్రామీణం : ఎరాజ్‌పల్లిలో..



సాలూరలో..

జై జగదాంబ

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చింది. జై జగదాంబ మాతాకీజై.. అంటూ నినదించారు. అర్చనలు, అభిషేకాలు, మంగళహారతులు సమర్పించారు. సామూహికంగా లలితాసహస్రనామ పారాయణాలు, భజనలు, భక్తిగీతాలను ఆలపించారు. కిషన్‌గంజ్ వాసవీమాతసన్నిధిలో పూజలు, పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు.



ఎడపల్లి : కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



బోధన్ : భీమునిగుట్ట సమీపంలో..



ఘన్‌పూర్‌లో...



ఆర్యనగర్‌లో..



జక్రాన్‌పల్లి : బ్రాహ్మణ్‌పల్లిలో..



మహారాష్ట్ర నుంచి ఇందూరుకు..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని పూజించేందుకు, బతుకమ్మలను పేర్చేందుకు పూలు తప్పనిసరి. ఈ సమయంలో గిరాకీ ఎక్కువగా ఉండడంతో మహారాష్ట్రలోని ధర్మాబాద్, పర్బనీ తదితర ప్రాంతాల నుంచి ఉదయం వచ్చే రైళ్లలో బంతి, చామంతి వంటి పూలను ఇందూరుకు తీసుకొస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ రోడ్డులో కిలో బంతిపూలను రూ. 40కి విక్రయిస్తున్నారు.

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఒక్కేసి పువ్వేసి చందమామ

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకల్లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మహిళలు శుక్రవారం ముద్దపప్పు బతుకమ్మను భక్తితో పూజించారు. తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మ మహిమలను గుర్తు చేసుకుంటూ ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ.. పాటలు పాడుతూ.. ఆడారు. అనంతరం నిమజ్జనం చేశారు.



బోధన్‌లోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో.. పుర ఛైర్‌పర్సన్ పద్మ



నగరంలోని షిరిడీసాయికృపానగర్ వాసవి రెసిడెన్సీలో



హమాల్‌వాడిలో..

రెండు పడక గదుల ఇళ్లు అర్హులకివ్వాలి

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: రెండు పడక గదుల ఇళ్లను అర్హులకు అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రం నాగారం శివారులో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను ఆయన సందర్శించి మాట్లాడారు. పేదల సొంతింటి కోసం ప్రధాని మోదీ నిధులు కేటాయిస్తే.. వాటిని మాజీ సీఎం కేసీఆర్‌కు పక్కదారి పట్టించారని ఆరోపించారు. అర్బన్‌లో కట్టిన ఇళ్లు శిథిలావస్థకు చేరాయని, కిటికీలు, తలుపులు, విద్యుత్తు పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి.. అర్హులైన వారికి కేటాయించాలన్నారు. గత ఎమ్మెల్యే మైనార్టీలకు 43శాతం ఇచ్చి మిగతా వర్గాలకు అన్యాయం చేశారన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి అర్హులకు ఇళ్లు అందించాలని కోరారు.



కిటికీలు ఎత్తుకెళ్లిన ప్రదేశం చూపిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

26 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

ఖలీల్‌వాడి : సీపీఎం జిల్లా మహాసభలు ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16 నుంచి 21 వరకు ప్రాంతీయ మహాసభలు, అనంతరం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లా మహాసభలకు రాష్ట్ర నాయకులు వీరయ్య, జ్యోతి, భాస్కర్, రమా హాజరుకానున్నారని తెలిపారు. సభలను విజయవంతం చేయాలని కోరారు. నూర్జహాన్, వెంకట్రాములు, వెంకటేష్, శంకర్, గంగాధర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

సర్వే పనులు అడ్డుకున్న నిర్వాసితులు

మంచిప్ప(మోపాల్), న్యూస్‌టుడే: మంచిప్ప పెద్ద చెరువు ఎడమ వైపు నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు 21/ఎ ప్యాకేజీ గడ్కోల్ పంపుహౌస్ వద్ద సర్వే చేయడానికి వచ్చి ఇరిగేషన్ డీఈ గంగాధర్‌ను ముంపు నిర్వాసితులు అడ్డుకున్నారు. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంచిప్ప చెరువు సామర్థ్యం, విస్తీర్ణం తదితర అంశాలపై సర్వే చేసి నివేదికలు తయారు చేయడానికి డీఈ ఆధ్వర్యంలో ఏఈ సిద్ధార్థ, ప్రైవేటు సర్వేయర్లు వెళ్లారు. వీరిని భైరాపూర్, తండా వాసులు అడ్డుకొని ప్రదేశానికి వెళ్లనీయకుండా చుట్టుముట్టారు. సర్వే చేసే అంశాలను మొదటగా గ్రామసభలో తెలియజేసి తర్వాత నివేదికలు తయారు చేయాలని పట్టుబట్టారు. చేసేదేమీ లేక అధికారులు సర్వే చేయకుండా వెనుతిరిగాల్సి వచ్చింది. ఈ విషయమై డీఈ గంగాధర్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు స్థానికుల డిమాండ్లు, సమస్యలు తెలియజేశామన్నారు.



మంచిప్పలో డీఈ గంగాధర్‌తో మాట్లాడుతున్న నిర్వాసితులు

పారితోషికాలు చెల్లించాలని వినతి

నిజామాబాద్ నగరం : బతుకమ్మ, దసరా పండగలకు ఆశాలకు పారితోషికం చెల్లించాలని కోరుతూ శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అధికారులకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ... కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని కోరారు.



అధికారులకు పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు

జంతు సంరక్షణ దినోత్సవం

ఖలీల్‌వాడి : లయన్స్ క్లబ్ సహారా ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద గల గోశాలలో ఆవులకు పండ్లు, పచ్చిమేత తినిపించారు. జంతువుల అవసరాలపై అవగాహన పెంచుకోవాలని క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లాకార్యదర్శి ఉదయ సూర్యభగవాన్, క్లబ్ అధ్యక్షుడు నరసింహరావు ఉన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

ఇందల్‌వాయి : గొల్ల, కుర్మ, యాదవుల ఐక్యతతోనే ఆయావర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని యాదవ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శుక్రవారం మండల గొల్ల, కుర్మ, యాదవ కులస్థుల సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లాధ్యక్షుడు మహిపాల్ సమక్షంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నగంగారాం, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్, యువజన సంఘాధ్యక్షుడిగా భాస్కర్ తదితరులను ఎన్నుకున్నారు.

శరీరదానానికి సుముఖత

వర్ని : మరణానంతరం తమ శరీరాలను వైద్య కళాశాలకు దానం చేయడానికి ఇద్దరు మహిళలు ముందుకొచ్చారు. రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌కు చెందిన సీతమ్మ (101), ఆమె కుమార్తె జ్యోతిలు శరీరదానం చేసేందుకు లయన్స్‌క్లబ్ ఆఫ్ వర్ని ఆధ్వర్యంలో సుముఖత చూపారు. వర్నిలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ శరీర అవయవదాతల సంఘం అధ్యక్షురాలు భారతి, వర్ని లయన్స్ అధ్యక్షుడు ఠాగూర్‌కు అందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలు అందజేశారు. బాలగంగాధర్, మంజులవాణి, శివరాజ్, సుబ్బారావు ఉన్నారు.

తల్లి కొట్టిందని ఇల్లు వదిలిన బాలుడు

• ఝార్ఖండ్ నుంచి బోధన్‌కు ప్రయాణం • తిరిగి కుటుంబీకులకు అప్పగించిన అధికారులు

కోటగిరి, న్యూస్‌టుడే: తల్లి కొట్టిందని ఓ బాలుడు స్వస్థలం నుంచి పారిపోయి బోధన్‌కు చేరుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి బాలల సంరక్షణ సమితి ఛైర్మన్ సంపూర్ణ, బాలల సంరక్షణ అధికారి చైతన్య తెలిపిన వివరాలు ప్రకారం.. ఝార్ఖండ్‌లోని సహబ్‌గంజ్ జిల్లా మహారాజ్‌పూర్ గ్రామానికి చెందిన వీర్‌కుమార్ (11) అనే బాలుడు గత నెల 29న బోధన్ అంగడిలో తిరుగుతుండగా స్థానికులు చరవాణులు దొంగిలించే బాలుడని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు బాలుడిని వివరాలు అడగగా.. తెలుపకపోవడంతో బాలల సంరక్షణ సమితి అధికారులకు అప్పగించారు. అధికారులు ఎక్లాస్‌పూర్‌లోని గుమ్మడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనాథ ఆశ్రమంలో చేర్చారు. ఆశ్రమ నిర్వాహకులు, పిల్లలు క్రమేపీ బాలుడి వివరాలు సేకరించారు. తమ ఊరు, పేరుతో పాటు తన తల్లి సవితదేవి, తండ్రి ప్రదీప్ అని వారి ఫోన్ నంబర్ సైతం తెలిపాడు. దీంతో అధికారులు అక్కడి బాలల సంరక్షణ సమితి అధికారులతో మాట్లాడి విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో అసలు విషయం తెలిసింది. స్వగ్రామం సమీపంలో గంగానది ఉండగా వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో బాలుడు తరచూ నదిలో స్నానం చేయడానికి వెళ్తుండేవాడు. నదికి వెళ్లొద్దని తల్లిదండ్రులు వారించినా వినకపోవడంతో తల్లి బాలుడిని కొట్టింది. దీంతో ఇంటి నుంచి పారిపోయి పలు రైళ్లలో ప్రయాణించి బోధన్‌కు చేరుకున్నాడు. శుక్రవారం సదరు బాలుడిని తల్లి సవితదేవికి అప్పగించారు. ఆశ్రమ మేనేజర్ మధు, సమితి సభ్యుడు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్లాస్‌పూర్ అనాథ ఆశ్రమంలో బాలుడిని తల్లికి అప్పగిస్తున్న అధికారులు

'స్థానిక సంస్థల్లో కార్యకర్తలను గెలిపించుకుంటాం'

ఇందల్‌వాయి, డిచ్‌పల్లి గ్రామీణం, సిరికొండ, న్యూస్‌టుడే: కార్యకర్తలు పార్టీకి వెన్నుదన్నుగా ఉండి ఎమ్మెల్యేలను, తమను గెలిపించారని, రాబోయే రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారిని గెలిపించాల్సిన బాధ్యత తమపై ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులై తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు చంద్రాయన్‌పల్లి, దేవీతండా, ఇందల్‌వాయి టోల్‌ప్లాజా, డిచ్‌పల్లి మండలకేంద్రం, నడిపల్లిలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. పార్టీ ఇందల్‌వాయి మండలాధ్యక్షుడు నవీన్ గౌడ్, కిషన్, గంగాధర్, సుధాకర్, రాజేందర్ రెడ్డి, మోహన్, భైరయ్య తదితరులు హాజరయ్యారు. సిరికొండ మండలాధ్యక్షుడు రవి, సొసైటీ ఛైర్మన్ గంగాధర్, డైరెక్టర్ సంతోష్, మహిపాల్, నర్సారెడ్డి, జనార్దన్, శివాజీ, రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఇందల్‌వాయి : మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్



మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న డీసీసీబీ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, చిత్రంలో మండవ

ఎకరాకు పది క్వింటాళ్లు కొనాలి

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్న సోయా పంటను ఎకరాకు పది క్వింటాళ్ల వరకు కొనాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విన్నవించారు. ప్రస్తుతం 6 క్వింటాళ్ల పరిమితితో రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం ఆయన నిజామాబాద్ పర్యటనకు వచ్చిన సందర్భంగా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు సమక్షంలో వినతిపత్రం అందజేసి సాగుదారుల సమస్యలను వివరించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని నిజామాబాద్ నార్త్ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్ పేర్కొన్నారు. వన్య ప్రాణుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సారంగపూర్‌లోని నేచర్ పార్కులో మొక్క నాటి నీరు పోశారు. వాతావరణాన్ని సమతుల్యంగా ఉంచడంలో మొక్కలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సమీర్, సెక్షన్ అధికారులు జహూర్, కుతుబుద్దీన్, సాయికృష్ణ, బీట్ అధికారులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న నార్త్ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్

అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్

రెంజల్, న్యూస్‌టుడే: రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో గతంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన రాణి, ప్రస్తుత కారోబార్ రమేష్ అక్రమాలకు పాల్పడ్డారని గ్రామస్థులు ఆరోపించారు. ఆ అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ ధర్నా చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించిన గ్రామస్థులు వారు ఇరువురు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ విషయంలో అక్రమాలకు పాల్పడి ఒకరి పేరిట ఉన్న ఇళ్ల స్థలాలను మరొకరి పేరిట చేయించారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేసి వారు ఇరువురిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.



ధర్నా చేస్తున్న గ్రామస్థులు

గిరిజనులకు చేయూత ఇవ్వాలి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేవిధంగా చూడాలని రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో శుక్రవారం సమీక్షించి మాట్లాడారు. గిరిజనులకు ఇంకా ఎలాంటి యూనిట్లు(వ్యాపారాలు) ఏర్పాటు చేయాలనేది జాబితా తయారు చేసి పంపాలన్నారు. సమావేశంలో అదనపు పాలనాధికారి కిరణ్ కుమార్, గిరిజనాభివృద్ధి శాఖ అధికారి నాగోరావు పాల్గొన్నారు.



బెల్లయ్య నాయక్‌ను సన్మానిస్తున్న అదనపు పాలనాధికారి

బాధిత కుటుంబానికి పరామర్శ

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: గన్యాతండాను శుక్రవారం రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్ సందర్శించారు. తండాకు చెందిన లంబాడా హక్కుల పోరాట సమితి న్యాయ సలహాదారు చిన్యనాయక్‌ను తల్లి మృతిచెందడంతో పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

నిజామాబాద్ నేరవిభాగం : కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని లాగిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాత కలెక్టరేట్ మైదానంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సభ జరిగింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌బీ కానిస్టేబుల్ అరవింద్ నగరానికి చెందిన ఎండీ హసన్ దగ్గర పాస్‌లేకపోవడంతో వేదిక మీదకు అనుమతించలేదు. దీంతో ఆగ్రహించిన హసన్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని లాగేశాడు. తన విధులకు ఆటంకం కలిగించాడన్న కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో ఠాణా ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

టోల్‌ప్లాజా వద్ద చోరీ

ఇందల్‌వాయి : టీపీసీసీ అధ్యక్షుడికి స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఇందల్‌వాయి టోల్‌ప్లాజాకు రావడంతో అదనుగా భావించిన తస్కరులు గుంపులో కొందరి జేబుల్లోంచి సొమ్ములు కాజేసినట్లు తెలిసింది. దేవీతండాకు చెందిన ఒకరివి రూ.15వేలుపోయాయని, మరికొందరివి చోరీ అయ్యాయని, ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు చెప్పారు.

మొరం టిప్పర్ పట్టివేత

నవీపేట, న్యూస్‌టుడే : మొరం తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ శుక్రవారం తెలిపారు. మల్కాపూర్ నుంచి నవీపేట వైపు వస్తున్న వాహనాన్ని మల్కాపూర్ వద్ద పట్టుకున్నట్లు చెప్పారు.

మహారాష్ట్ర నుంచి ఇందూరుకు..

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం: శరన్నవ రాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని పూజించేందుకు, బతుక మ్మలను పేర్చేందుకు పూలు తప్పనిసరి. ఈ సమ యంలో గిరాకీ ఎక్కువగా ఉండడంతో మహారాష్ట్రలోని ధర్మాబాద్, పర్బనీ తదితర ప్రాంతాల నుంచి ఉదయం వచ్చే రైళ్లలో బంతి, చామంతి వంటి పూలను ఇందూరుకు తీసుకొస్తున్నారు. జిల్లా కేంద్రం లోని రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ రోడ్డులో కిలో బంతిపూలను రూ.40కి విక్రయిస్తున్నారు.



ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ

డివిజన్ I సూపరింటెండెంట్‌గా రవీందర్



రవీందర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు డివిజన్ I సూపరింటెండెంట్‌గా అమరగాని రవీందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించిన సుభాకర్ గత నెల 30వ తేదీన పదవీ విరమణ చేశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌ను ఈఈ చక్రపాణి, డీఏవో రాజలింగాగౌడ్, డీఈఈలు గణేష్, సుకుమార్, గంగాభూషణ్, రఘుపతి, విశ్రాంత అధికారి జాన్‌సుభాకర్‌లు కలిసి సన్మానించారు.

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు

స్క్రీన్ 1	**బహిర్భూమి:** 10.50, **మిస్టర్.సెలిబ్రిటీ:** 1.30, **చిట్టి పొట్టి :** 4.15, **జోకర్ ఫోలీ ఎ డెక్స్:** 10.30
స్క్రీన్ 2	**దేవర:** 11.00, 2.35, 6.10, 9.45
స్క్రీన్ 3	**కలి:** 11.05, **జోకర్ ఫోలీ ఎ డెక్స్:** 1.15, **దక్షణ:** 4.30, **దేవర:** 7.00, **రాంనగర్ బన్నీ:** 10.35
స్క్రీన్ 4	**స్వాగ్ :** 12.00, 3.20, 6.40, 10.00

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

భీమ్‌గల్, న్యూస్‌టుడే: బడాభీమ్‌గల్ గ్రామంలో చెత్తను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట, రోడ్డు వెంట వేస్తున్నారు. దుర్వాసన వస్తోంది. **-గంగాధర్, బడాభీమ్‌గల్**

సమాధానం: వెంటనే చెత్తను తొలగిస్తాం. అక్కడ వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటాం. **- రజిత, గ్రామ కార్యదర్శి**

నందిపేట్: నందిపేట్ వేంకటేశ్వర కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో బయటకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాం. **-సాయిలు, నందిపేట్**

సమాధానం: గ్రామంలో అన్ని కాలనీల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **-లక్ష్మీప్రసాద్, ఎంపీవో, నందిపేట్**

ఆర్మూర్ పట్టణం: మామిడిపల్లి 9 వార్డుకు చెత్త సేకరణకు వాహనం రావడం లేదు. మూడు రోజులైనా రాకపోవడంతో వ్యర్థాలు ఇంట్లోనే పేరుకొంటున్నాయి. **- రాజగంగు**

సమాధానం: చెత్త సేకరణ నిత్యం చేపట్టాలని ఆదేశిస్తాం. **- రాజు, బల్దియా కమిషనర్,**

మురుగుకాలువ శుభ్రం..





ఏర్గట్ల, న్యూస్‌టుడే: నాగేంద్రనగర్ నుంచి గుమ్మిర్యాల్ వైపు వెళ్లే మార్గంలో రహదారి పక్కన సీసీ డ్రైనేజీ లేకపోవడంతో మురుగు రహదారిపై పారుతుందని గుమ్మిర్యాల్‌కు చెందిన శంకర్ ‘మేమున్నాం..మీకు తోడుగా..’దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన పంచాయతీ అధికారులు తాత్కాలికంగా మురుగు కాలువను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. సీసీ డ్రైనేజీ నిర్మాణ విషయమై ఆర్ అండ్ బీ అధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

ధరలకు రెక్కలు.. ప్రజలకు చుక్కలు

–న్యూస్‌టుడే, ఆర్మూర్

- ☛ తగ్గిన కూరగాయల దిగుమతి
- ☛ పక్షం రోజుల్లో రెట్టింపు

వానాకాలమో, లేదంటే ఎండలు మండే సమయంలోనో కూరగాయల ధరలు పెరుగుతాయి. ఇప్పుడు కేవలం పండగ సీజన్‌తో వీటికి రెక్కలొచ్చాయి. పక్షం రోజుల వ్యవధిలోనే ఏది కొందామన్నా రెండింతలయ్యాయి. ఒకప్పుడు పల్లెల్లో సగం ఇళ్లల్లో సొంతగా పండించిన కూరగాయలు, ఆకుకూరలుండేవి. ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయితేనే తినాల్సిన పరిస్థితి. మార్కెట్లు పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకి వెళ్లడంతో వారు చెప్పిందే ధర. కృత్రిమ కొరత సృష్టించి ప్రజల నడ్డి విరుస్తున్నారు. ఉద్యాన, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖల నిర్లక్ష్యం సామాన్యుడి జేబుకు చిల్లు పడేలా చేస్తోంది.



మార్కెట్లో కిలో ధరలు(రూ.)

కూరగాయ	15 రోజుల కిందట..	ప్రస్తుతం..
బీరకాయ	25	70
బెండ	25	50
టమాటా	20	60
మెంతికూర	15	60
కాకర	20	50
పుదీనా	25	35
పాలకూర	20	35
దొండకాయ	20	45
గోబి	20	45
చిక్కుడు	40	70
కొత్తిమీర	20	45
వంకాయ	20	40

☛ జిల్లాలో ఒక్కప్పుడు 4 వేల ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండేవి. వాటి సాగు 600 ఎకరాలకు పడిపోయింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి దిగుమతి చేసుకోవాలిసి వస్తోంది. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు గతంలో 3 వేల క్వింటాళ్ల కూరగాయలు వచ్చేవి. పది రోజులుగా 900 క్వింటాళ్లు మాత్రమే దిగుమతి అవుతున్నాయి. స్థానికంగా పండినవి మార్కెట్‌కు రావడం లేదు.

☛ గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడ దిగుమతులు తగ్గిపోయాయి. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేదు. హోల్‌సేల్‌గా కిలో టమాట, గోరుచిక్కుడు రూ. 40, బీర, బిన్నీస్ రూ. 50, క్యాప్సికం రూ. 60, గోబి రూ. 35, వంకాయ, బెండకాయ రూ. 25, ఉండగా బయట రిటైల్ మార్కెట్‌లో ఇవి కాస్త అటుఇటుగా రెట్టింపు పలుకుతున్నాయి.

గత నెలలో వినాయక చవితి సందర్భంగా అన్నదానాలు, ఇప్పుడేమో శరన్నవరాత్రులుండడంతో శాకాహారానికి డిమాండ్ పెరిగింది. దీన్ని వ్యాపారులు ఆసరాగా తీసుకుని ధరలు పెంచారనే ఆరోపణలున్నాయి. దీని ప్రభావం మరో పది రోజుల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

టమాటా అసలే కొనలేం

భవాని, మామిడిపల్లి

గత వారంతో పోలిస్తే ఈ రోజు టమాటా ధర అధికంగా ఉంది. అసలే కొనలేని పరిస్థితి నెలకొంది. రూ. 40-50 ఉండే టమాట, నేడు రూ.100కు పైగా చెబుతున్నారు. ధరలు అధికంగా ఉంటే మధ్యతరగతి వారు కొనలేని స్థితి ఉంది.

సగం సంచి నిండటం లేదు

కవిత, గృహిణి, ఆర్మూర్

కూరగాయల ధరలు పెరిగాయి. రూ.500 తీసుకొని మార్కెట్ వెళ్తే సగం సంచి కూడా నిండటం లేదు. ఒకప్పుడు వారానికి సరిపోయే కూరగాయాలు వచ్చేవి. ఇప్పుడు మూడు, నాలుగు రోజులకే అవి సరిపోతున్నాయి.

నెలరోజుల్లో తగ్గుముఖం

మధుసూదన్, జిల్లా ఉద్యానశాఖాధికారి

అధిక వర్షాల వల్ల కూరగాయలు, ఆకుకూరల పంటలకు నష్టం జరిగి ఉత్పత్తి తగ్గింది. ఇది ధరల మీద ప్రభావం చూపింది. ఇప్పుడు కొత్తగా వేసిన పంటలు నెలరోజుల్లో చేతికందితే ధరలు అదుపులోకి వస్తాయి. దిగుమతుల మీదే ఎక్కువ ఆధారపడుతుండడంతో వినియోగదారుల అవసరాలు తీరడం లేదు. రానున్న రోజుల్లో రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లిస్తాం.

దుర్గాదేవికి పూజలు



బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ, మెండోరా మండలాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో ప్రతిష్ఠించి దుర్గాదేవి ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు శుక్రవారం దేవిని గాయత్రి దేవిగా అలంకరించి పూజలు చేశారు. బాల్కొండలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ దేవి మందిరం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవికి పూజలు జరిపారు. మహాలక్ష్మి మందిరం, ఎన్టీఆర్ కాలనీ, ఏబీనగర్ తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి ప్రతిమలకు పూజలు చేశారు.

కనుల పండువగా కుంకుమార్చన



నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో దేవి మండపాల వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం పలు చోట్ల మహిళలు కుంకుమార్చనల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు హోమాలు, పూజలతో అన్నదానాలు నిర్వహిస్తున్నారు.

మండపాలకు చీరల పంపిణీ



ఆర్మూర్ గ్రామీణం: అంకాపూర్‌లో శుక్రవారం పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ సుచరితరెడ్డి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా దుర్గాదేవి మండపాలలో దేవిని అలంకరించేందుకు చీరలను కానుకగా అందించారు. భాజపా నాయకుల ద్వారా మండపాల నిర్వాహకులకు చీరలు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు.. పనులు షురూ

తిమ్మాపూర్(మోర్తాడ్), న్యూస్‌టుడే: మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ వద్ద చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పైపులైన్ మరమ్మతు పనులు ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. గతంలో పైపులైన్ పగిలి లీకేజీ ఏర్పడింది. ఈ విషయాన్ని అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పనుల కోసం రూ. 47లక్షలు ప్రభుత్వం కేటాయించింది. నిధులతో గుత్తేదారు ప్రస్తుతం పనులు ప్రారంభించారు. ప్రస్తుతమున్న సిమెంట్ పైపును తీసేసి.. ఎంఎస్ పైపులను బిగించనున్నారు. ఈవిషయంపై ‘న్యూస్‌టుడే’ ఇరిగేషన్ ఏఈ త్రిశూల్‌ను వివరణ కోరగా. . పనులు చేపట్టామని చెప్పారు. పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం మోటార్లను నిలిపివేస్తామని చెప్పారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. పనులు పూర్తవడానికి సుమారు నెల రోజుల సమయం పడుతుందని చెప్పారు.



చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి వద్ద జరుగుతున్న పైప్‌లైన్ మరమ్మతు పనులు

స్వచ్ఛంద సంస్థ పేరుతో వసూళ్లు



ఎస్సై గంగాధర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆర్మూర్ వాసులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలో ఓ స్వచ్ఛంద సంస్థ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఆర్మూర్‌లో ఓ లాడ్జిలో మకాం వేశారు. పది రోజులుగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ ముఠా సభ్యులు వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించారు. నవీపేట మండలంలోని ఓ సంస్థ పేరుతో వసూళ్లకు పాల్పడుతుండగా, ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు అనుమానంతో ఇక్కడ గతంలో సేవా కార్యక్రమం చేసిన వారి పరిచయంతో ఆరా తీశారు. దందా చేస్తున్నట్లు గ్రహించి, వారిని పట్టుకోవాలని ప్రణాళిక రచించారు. పుట్టిన రోజు ఉందని సాయం చేస్తామని ముఠాకు చెందిన ఇద్దరిని పిలిపించారు. వారిని ఆర్మూర్ బస్టాండ్‌లో పట్టుకొని సదరు సంస్థకు తీసుకెళ్లారు. ఆ సంస్థ ప్రతినిధులు ముఠా సభ్యులతో తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. మేడ్చల్ కేంద్రంగా విజన్ ఇండియా ఫౌండేషన్ పేరుతో ఐడీ కార్డులు సృష్టించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. కౌన్సిలర్ లిక్కి శంకర్ సహాయంతో వీరందరిని ఆర్మూర్ పోలీసులకు అప్పగించి, ఫిర్యాదు చేశారు.

జల విద్యుదుత్పాదన కేంద్రం ఎదుట ఆందోళన

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: రామగుండంలో నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పాదన కేంద్రాన్ని జెన్‌కో, సింగరేణి భాగస్వామ్యంలో కాకుండా ఒక్క జెన్‌కో ఆధ్వర్యంలో చేపట్టాలని కోరుతూ కొన్ని రోజులుగా జెన్‌కో రాష్ట్ర ఐకాస ఇచ్చిన పిలుపు మేరకు శ్రీరామసాగర్ ప్రాజెక్టు వద్ద గల జల విద్యుదుత్పాదన కేంద్రంలోని ఇంజినీర్లు, ఉద్యోగులు ఆందోళన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆందోళనకు దిగారు. డీఈఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులు..

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాల్వకు గురువారం నీటి విడుదలను నిలిపారు. విషయం తెలుసుకున్న మత్స్యకారులు శుక్రవారం చేపల కోసం కాల్వలోకి దిగారు. ఎస్సారెస్పీ అధికారులు శుక్రవారం ఉదయం వరద కాలువకు నీటిని వదిలారు. మత్స్యకారులు చేపల వేట కొనసాగుతుండగా కాల్వలో నీటి ప్రవాహం పెరగడంతో ప్రాణాలు చేతులో పెట్టుకొని కాల్వ నుంచి ఒడ్డుకు చేరుకున్నారు. ప్రాజెక్టు అధికారులు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు, సమాచారం లేకుండా వరద కాల్వకు నీటి విడుదల చేశారని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రవాహంలో గల్లంతయ్యే ప్రమాదం ఉండేదని అదృష్టవశత్తు బయటకు వచ్చామని పేర్కొన్నారు. ప్రాజెక్టు కాల్వల ద్వారా నీటి విడుదల చేసే సమయంలో గ్రామాల్లో ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.


‘స్థానిక సంస్థల్లో కార్యకర్తలను గెలిపించుకుంటాం’

ఇందల్‌వాయి, డిచ్‌పల్లి గ్రామీణం, సిరికొండ, న్యూస్‌టుడే: కార్యకర్తలు పార్టీకి వెన్నుదన్నుగా ఉండి ఎమ్మెల్యేలను, తమను గెలిపించారని, రాబోయే రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారిని గెలిపించాల్సిన బాధ్యత తమపై ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులై తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు చంద్రాయన్‌పల్లి, దేవీతండా, ఇందల్‌వాయి టోల్‌ప్లాజా, డిచ్‌పల్లి మండలకేంద్రం, నడిపల్లిలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. పార్టీ ఇందల్‌వాయి మండలాధ్యక్షుడు నవీన్ గౌడ్, కిషన్, గంగాధర్, సుధాకర్, రాజేందర్ రెడ్డి, మోహన్, భైరయ్య తదితరులు హాజరయ్యారు. సిరికొండ మండలాధ్యక్షుడు రవి, సొసైటీ ఛైర్మన్ గంగాధర్, డైరెక్టర్ సంతోష్, మహిపాల్, నర్సారెడ్డి, జనార్దన్, శివాజీ, రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్

ఉపాధ్యాయులకు శిక్షణ



సరస్వతీదేవి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న సంఘం ప్రతినిధులు

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మండల ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పెర్కిట్‌లో శుక్రవారం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. అనంతరం బోధనా విధానాలు, మెలకువలపై శిక్షకులు వివరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భరత్‌చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్య ప్రవీణ్ పవార్, కోశాధికారి స్కాలర్స్ వేణు, శ్రీభాషిత సుందర్, శ్రీమోడల్ మల్లేష్, నలంద సాగర్, మానస గణేష్, వంశీ ప్రజ్ఞ, కాంతి శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో సర్వే పరిశీలన



బాల్కొండ, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్‌లో నిర్వహిస్తున్న డిజిటల్ కుటుంబ సర్వేను శుక్రవారం ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో గంగామోహన్, సూపరింటెండెంట్ రమణ, ఆర్ఐ భరత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన న్యాయవాదుల నిరసనలు

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాదిపై దాడికి నిరసనగా రెండో రోజైన శుక్రవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులను బహిష్కరించి జిల్లా కోర్టు ముందు నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి, హోం మంత్రులకు వినతి పత్రాలు పంపించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, ఆశ నారాయణ, నాగేశ్, పిల్లి శ్రీకాంత్, మధుసూదన్‌గౌడ్, ఎం.వి. నాగేశ్వర్‌రావు, అవినాశ్, విశ్వక్‌సేన్, ప్రకాశ్, రాజు, గంగాధర్, అపూర్వ, సాయి సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని కుక్కల గుట్ట కాలనీ బ్రహ్మంగారి గుడి వద్ద మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. ఈ మార్గంలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు శుక్రవారం బల్దియా అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో స్థానికులు రవికుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోండి



దరఖాస్తు ఫారాలు విడుదల చేస్తున్న భాజపా నాయకులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తు ఫారాన్ని భాజపా నాయకులు శుక్రవారం ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. డిగ్రీ, పదో తరగతి ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు నకలును జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల అసెంబ్లీ కన్వీనర్ జెస్సు అనిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి యుగంధర్, కృష్ణ, కిరణ్ కుమార్, ప్రశాంత్, రాజ్‌కుమార్, ఉదయ్ గౌడ్, చిన్నయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మాన సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

భీమ్‌గల్, న్యూస్‌టుడే: పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుని మొదటి సారిగా నిజామబాద్‌కు వచ్చిన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌కు శుక్రవారం నిర్వహించిన సన్మాన సభకు భీమ్‌గల్ మండల కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి మాట్లాడుతూ.. భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ గ్రామానికి చెందిన బీసీ నాయకుడు, మారు మూల గిరిజన ప్రాంతానికి చెందిన నాయకుడు కాంగ్రెస్ పార్టీ పీసీసీ బాధ్యతలు చేపట్టడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ కుంట రమేష్, నర్సయ్య, లక్ష్మణ్, గంగాధర్, రంజిత్ కుమార్, బలరాం తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుల ఆహ్వానం

నందిపేట్ గ్రామీణం: అయిలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర బోధించేందుకు అతిథి అధ్యాపకుడిగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఆర్గుల చిన్నయ్య ఓ ప్రకటనలో కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు కనీస విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు మూడు సెట్లతో శనివారం నుంచి కళాశాల పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఎకరాకు పది క్వింటాళ్లు కొనాలి



మంత్రి తుమ్మలకు వినతి ఇస్తున్న డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, చిత్రంలో మండవ

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్న సోయా పంటను ఎకరాకు పది క్వింటాళ్ల వరకు కొనాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విన్నవించారు. ప్రస్తుతం 6 క్వింటాళ్ల పరిమితితో రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం ఆయన నిజామాబాద్ పర్యటనకు వచ్చిన సందర్భంగా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు సమక్షంలో వినతిపత్రం అందజేసి సాగుదారుల సమస్యలను వివరించారు.

అవీ...ఇవీ.. అన్నీ

మొక్కలు నాటి సంరక్షించాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని నిజామాబాద్ నార్త్ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్ పేర్కొన్నారు. వన్య ప్రాణుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సారంగపూర్‌లోని నేచర్ పార్కులో మొక్క నాటి నీరు పోశారు. వాతావరణాన్ని సమతుల్యంగా ఉంచడంలో మొక్కలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సమీర్, సెక్షన్ అధికారులు జహూర్, కుతుబుద్దీన్, సాయికృష్ణ, బీట్ అధికారులు పాల్గొన్నారు.

వీడీసీ ప్రతినిధులకు సన్మానం

ఆర్మూర్ గ్రామీణం: ఆలూర్ గ్రామాభివృద్ధి నూతన కమిటీ సభ్యులను శుక్రవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యంరెడ్డి, ఇతర ప్రతినిధులు, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీరయ్య, నారాయణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

6న శాకాహార ర్యాలీ

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎస్ఎస్ఎం నవనాథపురం ఆధ్వర్యంలో పట్టణంలోని మామిడిపల్లిలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న (ఆదివారం) ఆంజనేయస్వామి ఆలయంలో ధ్యాన బతుకమ్మ సంబరాలు, ఆత్మ జ్ఞాన కార్యక్రమం, అనంతరం అహింసాయుత మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

సంఘం సభ్యులుగా నియామకం

బాల్కొండ, న్యూస్‌టుడే: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ జిల్లా సలహా సంఘం సభ్యుడిగా బాల్కొండకు చెందిన ఆరెపల్లి నర్సయ్యను నియామకం చేశారు. ఈ మేరకు ఆదేశాలు వెలువడ్డాయి. నర్సయ్య భాజపాలో క్రియాశీలకంగా కొన్నేళ్లుగా పని చేస్తున్నారు.

నందిపేట్, న్యూస్‌టుడే: టెలికం అడ్వైజరి కమిటీ సభ్యుడగా నందిపేట్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎలిగేటి రాజు నియమితులయ్యారు. ఈ మేరకు అధినాయకులు శుక్రవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుగూ... పార్టీ తనపై నమమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు.

చెట్లు నరికేశారు

భీమ్‌గల్, న్యూస్‌టుడే: పురాణీపేట్ యూపీఎస్ పాఠశాలలోని 11 వృక్షాలను పంచాయతీ కారోబార్ నరికించారు. ఎందుకు నరికేశారని గ్రామస్థులు, గ్రామాభివృద్ధి కమిటీ నిలదీయగా.. చుట్టుపక్కల ఇళ్లవారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెట్లను నరికించామని సమాధానమిచ్చారు. ఆగ్రహించిన గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కమ్మర్‌పల్లి అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి దేవదాస్ ఆధ్వర్యంలో అధికారులు పాఠశాల వద్దకు వచ్చి చుట్టుపక్కల వారిని పిలిపించి విచారించారు. లింబాద్రి, మాధవిలకు రూ. 12,100, గంగయ్య, శోభలకు రూ. 5వేల చొప్పున జరిమానా విధించారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ పట్టణంలో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 33 కేవీ ఆర్మూర్ లైన్ నిర్వహణ పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ డిఈ హరిచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

డీజే నిర్వాహకుడిపై కేసు

వన్నెల్(బి)(బాల్కొండ), న్యూస్‌టుడే: వన్నెల్(బి)లో డీజేలపై నిషేధం ఉన్నా ఎటువంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా బహిరంగ ప్రదేశంలో డీజే పెట్టి ప్రజలకు ఇబ్బంది కల్గించారని ఎస్ఐ నరేష్ తెలిపారు. నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. డీజేను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

హార్వెస్టర్ ఢీకొని ఒకరి మృతి

కమ్మర్‌పల్లి,న్యూస్‌టుడే: ఉప్లూర్ శివారులోని దమ్మన్నపేట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చింత గణేష్(46) మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కమ్మర్‌పల్లికి చెందిన గణేష్ తన అత్తమ్మను ద్విచక్ర వాహనంపై ఉప్లూర్ గ్రామానికి తీసుకెళ్లి దింపాడు. తిరిగి కమ్మర్‌పల్లికి వస్తుండగా దమ్మన్నపేట వద్ద తోటల నుంచి వేగంగా వచ్చిన హార్వెస్టర్ ఢీకొంది. తలకు తీవ్రగాయమైన క్షతగ్రాతుడిని 108లో మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించగా చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.